క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న మజ్జి సోమేష్ తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని నాయకుడు మజ్జి సోమేష్ ప్రారంభించి మాట్లాడారు. మండువేసవిలో చలివేంద్రం ద్వారా బాటసారులు, వాహన చోదకులకు మజ్జిగ, మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బూస అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వికాసంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న రమాప్రభ, విద్యార్థులు

కంచరపాలెం: వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ కమిటీ, బొట్టా నర్సింగరావు ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఊర్వశి జంక్షన్‌లోని బీఎస్‌ఆర్ భవనంలో విద్యా-వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి విద్యావేత్త కె.రమాప్రభ మాట్లాడుతూ విద్యార్థి దశలో అభివృద్ధి చెందితే వికాసానికి మార్గాలు దొరుకుతాయన్నారు. తద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. విద్యా వికాసంపై పలువురు అడిగిన సందేహాలను ఆమె నివృత్తి చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, బీఎస్‌ఆర్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు బాక్సింగ్ పోటీలు



ఫ్రెండ్లీ పోటీలో తలపడుతున్న చిన్నారి బాక్సర్లు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఎంఐజీ కాలనీలోని మైదానంలో మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. వీటితోపాటు సమ్మర్ క్యాంప్‌ను అతిథి కార్పొరేటర్ పి.వి.సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు విభాగాల చిన్నారులకు బాక్సింగ్‌లో శిక్షణ, ఫ్రెండ్లీ పోటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రకాష్, నాయకులు మజ్జి సోమేష్, భోగవల్లి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ వాలీబాల్ జట్టు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: నెల్లూరులో జరగనున్న అంతర కళాశాలల వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఏఎంసీ జట్టును వాలీబాల్ సమాఖ్య ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే పి.వి.జి.ఆర్ నాయుడు అభినందించారు. ఈ చాంపియన్‌షిప్ ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరుగుతుంది. పోర్ట్ స్టేడియంలో ఆదివారం జట్టు ఎంపిక పోటీలు జరిగాయి. ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, సాయ్ సెంటర్ ఇన్‌చార్జి సత్యనారాయణ, కోచ్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

బీచ్ రోడ్డు: నగరంలోని రౌడీషీటర్లకు ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ త్రినాథరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచి నడవడిక కలిగి తే రౌడీషీట్ క్లోజ్ చేసేందుకు పరిశీలిస్తామన్నా రు. కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



పల్లి వీధిలో సర్వే నిర్వహిస్తున్న గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు



గణేష్‌నగర్‌లో ఇంటి గోడకు స్టిక్కర్ అతికిస్తున్న స్థానిక మహిళ



62వ వార్డులో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు



40వ వార్డులో ఇంటి గోడకు స్టిక్కర్ అతికిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్తూ మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమం ప్రభంజనంలా కొనసాగుతుంది. జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పశ్చిమ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏ విధంగా మెరుగైె పాలనఅందించిందో వివరించారు. ఇంటి గోడపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికిస్తూ ప్రభుత్వ సుపరిపాలనపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలియజేయాలని కోరారు.

● జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్ సచివాలయ పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతో పాటు ప్రస్తుతం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు.

52వ వార్డులో బ్రహ్మరథం

గోపాలపట్నం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి 52వ వార్డు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ అన్నారు. వార్డులోని గణేష్‌నగర్‌లో ఈ కార్యక్రమాన్ని సింహాచలం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ, జియ్యాని మారుతి, యువజన నాయకుడు జియ్యాని విజయ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన, పథకాల అమలు తీరును వివరించి కరపత్రాలు అందించారు. ప్రజాభిప్రాయ పుస్తకంలో ఇంటి యజమానితో 5 ప్రశ్నలకు సమాధానాలు అడిగి వాటిని నింపారు. ఈ సందర్భంగా బీఎస్ కృష్ణ మాట్లాడుతూ ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరమణ, సచివాలయ కన్వీనర్లు శ్రీనివాస్, అమర్, మల్లిక్‌షా, ఆర్పీ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

61వ వార్డులో..

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం పల్లివీధిలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఆ ప్రాంత గృహసారథులు,కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి నవరత్నాల పథకాల ద్వారా లబ్ధిపొందారా, ప్రస్తుత ప్రభుత్వ పాలన ఎలా ఉంది.. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో గృహసారథులు, కన్వీనర్లు చట్టి నూకరాజుయాదవ్, వరలక్ష్మి, బూస అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతో ప్రశాంతత



సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేస్తున్న బల్ల లక్ష్మణరావు దంపతులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురంలోని షిర్డీ సాయి సేవాశ్రమం 12వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, భారతి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని సాయి బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు దంపతులు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి దైవత్వం కలిగి ఉండాలన్నారు. ఆలయాలను ఏకాగ్రతతో దర్శించుకుంటే పుణ్యంతో పాటు మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొంది మనస్సుకు ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఏ ప్రాంతంలో ఆధ్యాత్మికత తాండవిస్తుందో ఆ ప్రాంతంలో ప్రజలు సుఖసంతోషాలు, సిరిసంపదలతో ఆనందంగా జీవిస్తారన్నారు. కార్యక్రమంలో సాయిసేవకులు వీరేశ్వరరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబకు ప్రత్యేక పూజలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజల నిర్వహించారు. స్థానిక సాయి సమత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాయిగణేష్ నూనెల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. పలు పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి హారతి పూజలు జరిపారు. కోర్కెలు నెరవేరిన భక్తులు ప్రతి ఆదివారం మరిడిమాంబను కొలుస్తుంటారు. ఇందులో భాగంగా పలు సామాజిక వర్గానికి చెందిన వారు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

సందడిగా ఆటల పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సింధియా: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంత్యుత్సవాల సందర్భంగా జీవీఎంసీ 40వ వార్డు పరిధి ప్రకాశం పార్కు మైదానంలో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘ ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్ కె.శామ్యూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో 40 మంది బాల బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ విద్యార్థి దశ ఆటల పోటీల్లో పాల్గొనడంతో క్రీడా స్ఫూర్తి మెరుగవుతుందన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఏప్రిల్ 14వ తేదీన కాలనీ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వెంకటఅప్పారావు, ఎం.మల్లేశ్వరరావు, పి.తాతబాబు, నరసింగమూర్తి, స్నేక్ క్యాచర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



కంచరపాలెం వద్ద ప్లకార్డు చూపిస్తూ అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు

మర్రిపాలెం: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం ట్రాఫిక్ పోలీసులు కంచరపాలెం మెట్టు, తాటిచెట్లపాలెం నుంచి ఎన్ఏడీ వరకు హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధారణపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మళ్ల అప్పారావు మాట్లాడుతూ గతేడాది హెల్మెట్ ధరించక 147 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించినట్టు తెలిపారు. ప్రతి ఒక్క వాహనదారుడికి కౌన్సెలింగ్ నిర్వహించడమే కాకుండా వారి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా హెల్మెట్ ధారణ ఆవశ్యకతను వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపి ఇబ్బంది కలిగిస్తున్నవారు, మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి తగు కౌన్సెలింగ్ చేశారు. ప్రత్యేక డ్రైవ్‌లో ఎయిర్‌పోర్టు ఎస్ఐ వాసుదేవరావు, ఎస్ఐ ఉల్‌హక్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



విందులో పాల్గొన్న ముస్లింలు

మర్రిపాలెం: రంజాన్‌ను పురస్కరించుకుని 53వ వార్డు మర్రిపాలెం మస్జిద్-ఈ-అల్ ఫతాలో ఆదివారం రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలు, మహిళలకు ప్రత్యేకమైన హలీంను అందించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు సత్కారం



ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన వేపాడ చిరంజీవిరావును జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే గణబాబు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ పట్టభద్రులు మేధావుల సభకు మేధావిని ఎన్నుకున్నారని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మడి రమణ, నాయకులు పాల్గొన్నారు.

యాచకుడికి సపర్యలు, ఆశ్రయం



ఎన్ఏడీ జంక్షన్‌లో యాచకుడికి స్నానం చేస్తున్న భూషణం మాస్టార్, రియాజ్



యాచకుడిని ఓల్డేజ్ హోమ్‌లో చేర్పిస్తున్న సంఘ సేవకులు

గోపాలపట్నం: మానవ సేవే.. మాధవ సేవ అని నమ్మిన ఎన్ఏడీ జంక్షన్ పరిధిలోని సంఘ సేవకులు ఓ యాచకుడికి సపర్యలు చేశారు. వివరాలిలా.. ఎన్ఏడీ జంక్షన్‌లో చెత్త కుప్పల వద్ద మతిస్థిమితం లేకుండా దుస్తులు లేని స్థితిలో ఓ నిరాశ్రయుడు ఉన్నాడు. ఇది గమనించిన భూషణం మాస్టారు, రియాజ్, స్థానికులు కలిసి యాచకుడికి స్నానం చేయించారు. ఆయనకు నూతన వస్త్రాలు వేసి పెందుర్తి లయోలా ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించారు. ఇది చూసిన వారంతా భూషణం మాస్టారు, రియాజ్ సేవలను కొనియాడారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

క్రిస్టియన్ శాంతివనంలో ప్రత్యేక ప్రార్థనలు



సెమెట్రీలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



సేవియర్ లూథరన్ చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న ఏసు ఆరాధికులు

గోపాలపట్నం: ఏసు ప్రభువు పాపులను క్షమించుటకై తన ప్రాణాలను పణంగా పెట్టాడు... మూడు రోజుల తర్వాత పునరుత్థానుడై లేచాడని పాస్టర్లు చెప్పారు. ఈస్టర్ సందర్భంగా ఆదివారం ఉదయం 4 గంటల నంచే జీవీఎంసీ 52వ వార్డు కరాసాలోని క్రైస్తవ శ్మశానవాటికలో పూర్వజనుల సమాధుల వద్ద విశేష పూజలు చేశారు. కుటుంబ సభ్యులు వారి సమాధులను కడిగి పూలతో అలంకరించారు. కొవ్వొత్తు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పూర్వీకులకు ఇష్టమైన పదార్థాలను అందరికీ పంచి పెట్టారు. క్రిస్టియన్ శాంతివనం అడ్వైజర్ సీహెచ్ ఎలియా, జీఎస్ సేవాకర్, కె. ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ బోర్డు అధ్యక్షుడు వై. రాజు, కార్యదర్శి వై. ఆంథోని, కోశాధికారి ఓలివాడ డేవిడ్ పాల్, సభ్యులు ఇక్కడి ఏర్పాట్లను సమీక్షించారు.

చర్చిల్లో ప్రార్థనలు

ఎన్ఏడీ, గోపాలపట్నం ప్రాంతాల్లో ఉన్న పలు చర్చిలు ఈస్టర్ సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. శ్మశాన వాటికలో పూజల తర్వాత చర్చిల్లో జరిగిన ప్రార్థనలకు హాజరయ్యారు. ఎరుసలేము ప్రార్థనా మందిరం, బాప్టిస్ట్ చర్చి ఏస్కోల్ ప్రెయర్ హౌస్, సేవియర్ లూథరన్ చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి. పాస్టర్లు క్రీస్తు జీవిత విశేషాలను భక్తులకు వివరించారు. యువతీ యువకులు ఏసును కీర్తిస్తూ ఆలపించిన గీతాలు అలరించాయి. కార్యక్రమాల్లో సంఘ సభ్యులు, సండేస్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం

దాబాగార్డెన్స్: సేంద్రియ ఉత్పత్తుల వినియోగం ఉత్తమమని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పేర్కొన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ స్టోర్‌ను ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. విశాఖ ప్రజలకు ఆర్గానిక్ ఉత్పత్తులు అందుబాటులోకి తేవడం సంతోషకరమన్నారు. స్టోర్‌లో విక్రయించే ఉత్పత్తులను ప్లాస్టిక్ రహిత సామగ్రిలో ప్యాక్ చేయడంపై నిర్వాహకులను అభినందించారు. స్టోర్ నిర్వాహకురాలు ప్రమీల మాట్లాడుతూ ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ఆర్గానిక్ స్టోర్ ఏర్పాటు చేశామన్నారు. సేంద్రియ ఉత్పత్తులు వినియోగిస్తే అనేక భయంకరమైన రోగాల బారిన పడకుండా ఉంటామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పల్లవి, గజేంద్ర అక్షయ్, సంతోష్ పాల్గొన్నారు.

మానవ హక్కుల కౌన్సిల్ సేవలు అమోఘం



మాట్లాడుతున్న మాజీ వీసీ సత్యనారాయణ

దాబాగార్డెన్స్: హక్కుల పరిరక్షణలో మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు చేస్తున్న సేవలు అమోఘమని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వై.సత్యనారాయణ కొనియాడారు. మానవ హక్కుల కౌన్సిల్ 23వ సర్వసభ్య సమావేశం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ మానవ హక్కులకు భంగం కలిగే సమయంలో కౌన్సిల్ ప్రతినిధులు పౌర హక్కుల పరిరక్షణకు చేసే పోరాటం మరువలేమన్నారు. కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు పౌర హక్కులపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పౌరహక్కుల పరిరక్షణకు రాజీ లేకుండా కృషి చేస్తున్నామని అన్నారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు న్యాయవాదులుగా తమ వంతు కృషి చేస్తున్నామని, కౌన్సిల్ చేస్తున్న కృషికి తమ సహకారం ఉంటుందన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా మానవ హక్కులకు సంబంధించి బాధితులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ అధికారి ఎస్వీ రమణ, బీఎస్ లత, మాధవి గణపతి, నిర్మల, డాక్టర్ వాసవి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో న్యూ హోప్ ఫౌండేషన్



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

దాబాగార్డెన్స్: న్యూ హోప్ ఫౌండేషన్ స్థాపించిన నాటి నుంచి ఎంతో మందికి వివిధ రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఆడిషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగేళ్లుగా చేనేత కార్మికులు, రైతుల చేయూతకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విశాఖకు చెందిన మహిళలకు ఆడిషన్స్ నిర్వహించామన్నారు. సుమారు వంద మంది ఔత్సాహికులు పాల్గొన్నారని, వీరిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసినట్టు తెలిపారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వారికి త్వరలో ఆడిషన్స్ ఉంటాయని చెప్పారు. సినీ నటుడు సురేష్‌నాయుడు మాట్లాడుతూ రైతులకు అండగా నిలుస్తున్న నాగమల్లేశ్వరిని అభినందించారు.

సమాచారమ్

అందుబాటులో జోన్-5 అధికారులు



జీవీఎంసీ జోన్-5 కార్యాలయం

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 అధికారులు ప్రజలకు అందుబాటులో ఉన్నారు. జోన్ పరిధిలో 40 నుంచి 63 వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. జోన్ పరిధి ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం వీరంతా పౌర సమాచార అధికారులుగా సేవలందిస్తున్నారు. జోన్ పరిధిలో ఏదైనా సమాచారం తెలుసుకోడానికి, సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి కింద పేర్కొన్న అధికారుల ఫోన్ నంబర్లకు కాల్ చేయవచ్చు. జ్ఞానాపురంలో జీవీఎంసీ జోన్-5 కార్యాలయం ఉంది. అక్కడ ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో నేరుగా ప్రజలు అర్జీలు సమర్పించవచ్చు.

జీవీఎంసీ జోన్-5 అధికారుల సమాచారం

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జోనల్ కమిషనర్ ప్రథమ అప్పిలేట్ అధికారి	97050 86888
టి.ఎస్.ఎస్.రాజు	సూపరింటెండెంట్-1 (రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	99481 25699
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్-2 (టౌన్‌ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ)	99897 84585
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్	99480 78507
డాక్టర్ ఎ.రాజేష్	అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (పబ్లిక్ హెల్త్)	99480 95520
ఐ.వి.రమణమూర్తి	అసిస్టెంట్ సిటీ ప్లానర్	81878 99199
కె.పద్మావతి	సీడీవో, ఏపీడీ ఇన్‌చార్జి(యూసీడీ)	89190 80201
ఆర్. బాబూరావు	రెవెన్యూ కమిషనర్	88972 10764

కుటుంబ సభ్యుల చెంతకు ఉమేష్



ఉమేష్‌ను అప్పగిస్తున్న మురళీ, పోలీసులు

ఎంవీపీ కాలనీ: మానసిక సమస్యల కారణంగా కుటుంబానికి దూరమైన కబ్బే ఉమేష్(20) అనే యువకుడిని రెడ్‌క్రాస్ ప్రతినిధి మురళీ త్రీటౌన్ పోలీసుల సమక్షంలో అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మానసిక స్థితి బాగోకపోవడంతో బళ్లారి ప్రాంతానికి చెందిన ఉమేష్ ఇంట్లో నుంచి పారిపోయి కొన్ని రోజుల కిందట విశాఖ చేరుకున్నాడు. ఆర్కే బీచ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అక్కడి టూరిజం పోలీసు స్టేషన్ సిబ్బంది త్రీటౌన్‌కు సమాచారం అందించారు. వారు పెదవాల్తేర్‌లోని రెడ్ క్రాస్ సొసైటీకి తరలించారు. క్రాస్ ప్రతినిధులు అతని వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

యువత భవిత కోసం ఆలోచన అవసరం



ఏఐవైఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న క్షేత్రపాల్

ఆరిలోవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత భవిష్యత్తు గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని ఏఐవైఎఫ్ నాయకుడు క్షేత్రపాల్ అన్నారు. ఆరిలోవ ప్రాంతం అల్లూరి సీతారామరాజు నగర్‌లో ఆదివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో యువతకు జరుగుతున్న అన్యాయం, సమస్యలను వివరించారు. యువత భవిష్యత్తు గురించి ఆలోచించగలిగినప్పుడే దేశం మంచి మార్గంలో ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, ఆరిలోవ శాఖ అధ్యక్షుడు అప్పలరాజు, చరణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.